WWW.NTNEWS.COM

# శంఖారావం 2018

2

హైదరాబాద్ ఆదివారం 4 నవంబర్ 2018 నమస్తే తెలంగాణ

## దిమాక్ ఖరాబ్

1. హాబీలేంటని అడిగితే హైద్రాబాద్ మీదపడి ఏడ్వడం అన్నాడు!
2. వేటగాడి దృష్టంతా బంగారు బాతుగుడ్డు పైనే!
3. కొందరి కష్టార్జితాలు పగవారికి కూడా వద్దు!
4. న్యూ బార్న్ బేబీకి అమూల్ బేబీ సలహా అదుర్స్!
5. గోడక్కొట్టిన సున్నం, ఇతరుల చేతికి ఇచ్చిన అగ్గిపెట్టె తిరిగిరావు!
6. ఢిల్లీకి వచ్చాకే ఢిల్లీ బహుత్ దూర్ హై అని అర్థమైంది!
7. ఫార్టీ మినిట్స్‌లో పార్టీ ఆఫీసు మూసెయ్యడం ఎలా అనేది చర్చించాం!
8. పార్టీ ఆఫీసుంది కాబట్టి సరిపోయింది, లేకపోతే చెక్క భజన చేసుకోవడం కష్టమయ్యేది!
9. సభ ప్రారంభంలో 'కుక్కపిల్ల అగ్గిపుల్ల కాదేదీ కవిత కనర్హం' విధిగా చదవాలి!
10. పంగనామాలకు సింబాలిగ్గా ఉంటుందని మూడు సీట్లు ప్రతిపాదించాం!

- మోహన్ రుషి





వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని దొడగుంటపల్లి గ్రామం, కొత్తకుంటతండాలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, వనపర్తి నియోజకవర్గ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొడగుంటపల్లి శివారులో వేరుశనగ పొలంలో గొర్రు కొడుతున్న దృశ్యం.

# అటు సీనియర్లు, ఇటు వారసులు



- ఎన్నికల బరిలో సీనియర్ల కుటుంబసభ్యులు కూడా
- ఒక్కో కుటుంబంలో ఇద్దరేసి సభ్యులు
- ఒకరికన్నా ఎక్కువ ఇవ్వవద్దని పార్టీ అధిష్ఠానం ఆదేశం
- అయినా, గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఖరారుపై దృష్టి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ అధిష్ఠానం నియమ నిబంధనలకు విరుద్ధంగా పార్టీలో సీనియర్ నేతల వారసులు తాము సైతం ఎన్నికల బరిలో ఉంటామని తేల్చేస్తున్నారు. పార్టీలోని సీనియర్లు తమ వారసులను ఎన్నికల బరిలో నిలిపేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరి కొందరైతే ఆశిస్తున్న నియోజకవర్గాలలో ప్రచారాన్ని కూడా ముమ్మరం చేశారు. ఒకవైపు పార్టీ అధిష్ఠానం మాత్రం 'ఒక కుటుంబంలో ఒక్కరికే అవకాశమంటూ' ఆదేశించింది. అయినా కూడా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో మాత్రం సీనియర్ నేతల కొడుకు, బిడ్డలను ఆశావహుల లిస్టులో చేర్చు తున్నట్టు సమాచారం ఉంది.

**అధిష్ఠానానిదే తుది నిర్ణయం**

కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలో సీనియర్ నేతల పేర్లను కూడా షార్ట్‌లిస్టులో పొందుపరిచినట్లు సమాచారం. 30 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఒక్కొక్కరి పేరును ప్రతిపాదించారు. అలాగే, మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలలో దాదాపు 2 నుంచి 4 వరకు అభ్యర్థుల పేర్లను పార్టీ అధిష్ఠానానికి పంపించేందుకు కసరత్తు సాగుతున్నది. ఒకటి, రెండు రోజుల్లో మహాకూటమి నేతలు ఆశించే నియోజకవర్గాలను సైతం ఖరారు చేసి ఆ జాబితాను కూడా అధిష్ఠానానికి పంపనున్నారు. వీటన్నింటినీ పరిశీలించిన మీదటే అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

| సీనియర్ నేతలు | వారసులు | వారు ఆశిస్తున్న నియోజకవర్గాలు |
|---|---|---|
| మాజీ మంత్రి జానారెడ్డి నాగార్జునసాగర్ | కొడుకు రఘువీర్‌రెడ్డి | మిర్యాలగూడ |
| కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ | తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | మునుగోడు |
| ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ | భార్య మాజీ ఎమ్మెల్యే పద్మావతి | కోదాడ |
| డీకే అరుణ, గద్వాల | కూతురు స్నిగ్ధ | మక్తల్ |
| సబితాఇంద్రారెడ్డి మహేశ్వరం | కొడుకు కార్తీక్‌రెడ్డి | రాజేంద్రనగర్ |
| కొండా సురేఖ- పరకాల | భర్త కొండా మురళీధర్‌రావు | వరంగల్ (వెస్ట్) |
| ముఖేశ్‌గౌడ్- గోషామహల్ | కొడుకు విక్రంగౌడ్ | ముషీరాబాద్/ ఖైరతాబాద్ |
| మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ | కొడుకు అనిల్‌కుమార్‌యాదవ్ | ముషీరాబాద్/ అంబర్‌పేట |

# పబ్లిక్ హీరో.. కేసీఆర్



**ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు టీఆర్‌ఎస్ పార్టీకి ప్రధాన ఆకర్షణ. ఉద్యమ కాలం నుంచి గత ఎన్నికల వరకు టీఆర్‌ఎస్‌కు ఆయనే ప్రచార సారథి. సినీగ్లామర్‌ను మించిన ప్రజాకర్షణ ఆయన సొంతం. ఆయనే ప్రధాన ప్రచారకర్తగా, ఎన్నికల రంగంలోకి దిగింది టీఆర్‌ఎస్. ప్రచారాన్ని మొత్తం ఆయనే ముందుండి నడిపించనున్నారు.**

- ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చిన హీరో
- ఉద్యమ నాయకులకే పట్టం కట్టిన ప్రజలు
- ఈ ఎన్నికల్లోనూ కేసీఆరే ప్రత్యేక ఆకర్షణ
- సినీ గ్లామర్‌నే నమ్ముకొన్న ప్రతిపక్షాలు
- గత ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు ఒంటిచేత్తో గెలుపు

**నేలకుర్తి శ్రీనివాస్‌రెడ్డి,**
**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

2014 ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వందకుపైగా సభల్లో పాల్గొని టీఆర్‌ఎస్‌ను ఒంటిచేత్తో గెలిపించారు. ఈసారి సైతం ఆయన వందకుపైగా స్థానాల్లో ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం అవుతున్నది. ముఖ్యమంత్రిగా, పార్టీ అధినేతగా, ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న నేతగా ఆయన టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. మళ్లీ అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో.. మరింత మెరుగైన సుపరిపాలన ఎలా అందిస్తారో వివరించి చెప్పనున్నారు.



**సినీగ్లామర్‌నే నమ్ముకున్న కాంగ్రెస్**

టీఆర్‌ఎస్‌కు భిన్నంగా కాంగ్రెస్, టీడీపీ వంటి ప్రతిపక్షాలు ప్రజలను ఆకర్షించడానికి సినీగ్లామర్‌ను నమ్ముకున్నాయి. కాంగ్రెస్ నేతలు ఇన్నాళ్లూ రాజకీయాలకు దూరంగా ఉన్న సినీనటి విజయశాంతిని ఆగమేఘాల మీద తీసుకొచ్చారు. ప్రచార కమిటీలో నియమించారు. సినీ నిర్మాత బండ్ల గణేశ్ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో వివిధ నియోజకవర్గాల్లో ప్రచారం చేయించాలని పార్టీ ఆలోచిస్తున్నది. మరోవైపు సినీహీరో చిరంజీవిని సైతం ప్రచారానికి ఆహ్వానించాలని నిర్ణయించినట్టు సమాచారం. మహాకూటమిలోని మరోపార్టీ టీడీపీ సైతం గ్లామర్‌నే నమ్ముకున్నది. సినీహీరో బాలకృష్ణను ఎన్నికల ప్రచారానికి రావాల్సిందిగా టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ, ఇతర నాయకులు ఇప్పటికే ఆహ్వానించారు. ఆయనతోపాటు మరికొందరు హీరోలు, హీరోయిన్లు టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారానికి వస్తారని అంచనా. బీజేపీ సైతం ఎన్నికల ప్రచారానికి సినీతారలను ఆహ్వానించాలని నిర్ణయించినట్టు సమాచారం. కొందరు టీవీనటులను సైతం ప్రచారానికి తీసుకురావాలని ప్రతిపక్ష పార్టీలు భావిస్తున్నాయి. సినీతారలు ప్రచారం చేసేందుకు ముందుకొస్తున్నా.. ఎన్నికల్లో పోటీ చేయడానికి మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

**తెలంగాణ జనం పట్టించుకోరు**

తెలంగాణ ప్రాంతంలో మొదటి నుంచీ సినీ గ్లామర్‌కు అంతగా ఆదరణ లేదు. నిజ జీవితంలో మార్పు తీసుకొచ్చినవారినే నిజమైన హీరోలుగా భావిస్తుంటారు. ఏనాడూ ప్రజల కష్టసుఖాలను పట్టించుకోకుండా, కేవలం ఎన్నికల కోసమే వచ్చే వారు నాయకుడైనా.. సినీ హీరోనైనా ప్రజలు స్వాగతించరు. ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేసే వారినే ఆశీర్వదిస్తారు. గత ఎన్నికల్లోనూ ఈ విషయం రుజువైంది. కాంగ్రెస్, టీడీపీ తరఫున పవన్‌కళ్యాణ్, ఇతర హీరోలు ప్రచారం చేసినా ప్రజలు టీఆర్‌ఎస్‌కే పట్టం కట్టారు. 60 ఏండ్ల తెలంగాణ రాష్ట్ర కలను నిజంచేసిన పోరాటయోధుడు కేసీఆర్‌నే హీరోగా ప్రజలు భావించారు. అందుకే అత్యధిక నియోజకవర్గాల్లో గులాబీ జెండాను గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారు. తెలంగాణపై పూర్తి అవగాహన ఉన్న నేతగా.. ఇక్కడి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం గత నాలుగున్నరేండ్లుగా నిరంతరం శ్రమిస్తున్నారు. ఇక్కడి వెనకబాటుతనాన్ని పోగొట్టడంలో, స్థానిక వనరులను వినియోగించుకోవడంలో ఆయనకు ఆయనే సాటిగా నిలిచారని పరిశీలకులు చెప్తున్నారు. సినిమా నటుల సభలకు ప్రజలు కేవలం వారిని చూసేందుకే వస్తారని.. ఇంటికి వెళ్లిన తర్వాత పార్టీ విధానాలు, అభ్యర్థుల గురించే ఆలోచిస్తారని వివరిస్తున్నారు. ఇక్కడి కట్టూబొట్టు.. కష్టం, సుఖం తెలిసినవారినే మళ్లీ ఆదరిస్తారని.. సీఎం కేసీఆర్‌నే మళ్లీ గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని విశ్లేషకులు

**కేసీఆర్.. ప్రజల హీరో**



**సీఎం కేసీఆర్** ముందు సినీ గ్లామర్ పనిచేయదు. ఎంత పెద్ద హీరో వచ్చి ప్రచారం చేసినా.. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌నే హీరోగా చూస్తారు. తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేయడంతోపాటు.. వినూత్న పథకాలు, వ్యూహాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన నేతగా ఆయనకు ప్రజల గుండెల్లో స్థానం ఉన్నది. కేసీఆర్ పబ్లిక్ హీరో. ఆయన రచించిన వ్యూహాలు, ప్రణాళికలు, సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు ఏ సినీహీరోకు సాధ్యంకావు. మంచి వక్తగా, విస్తృతమైన జ్ఞానం ఉన్న నేతగా, ఉత్తమ వ్యూహకర్తగా, ధైర్యశాలిగా ఆయనకు దేశవ్యాప్త గుర్తింపు ఉన్నది.

**- కొప్పుల ఈశ్వర్, ధర్మపురి టీఆర్‌ఎస్ అభ్యర్థి**

**సినీగ్లామర్ ప్రభావం ఉండదు**




**టీఆర్‌ఎస్** పార్టీకి ప్రత్యేకంగా సినీహీరోలు అవసరం లేదు. సీఎం కేసీఆర్‌ను ప్రజలు తమ సమస్యలపై పోరాడి, పరిష్కరించిన వ్యక్తిగా చూస్తున్నారు. తెలంగాణ శక్తిని ప్రపంచానికి చాటిన నేత. అందుకే ఆయననే హీరోగా భావిస్తున్నారు. ప్రజల్లో ఆయనకు సినీహీరోలకు మించిన ఫాలోయింగ్ ఉన్నది. తెలంగాణలో మొదటి నుంచి సినీ గ్లామర్ ప్రభావం లేదు. మాకు సినిమా హీరోలు అవసరం లేదు.

**- ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఆర్మూర్ టీఆర్‌ఎస్ అభ్యర్థి**

# మధురవాణి పాతివ్రత్య కథ

**ఇదీ సంగతి**

**ఏరా పెంటయ్యా.. అంతగా ఆశ్చర్య పోతున్నావ్?**
అదే బాబుగారు, కాంగ్రెస్ కలయిక నమ్మశక్యంగా లేదండి.
**ఇందులో ఆశ్చర్య పోవడానికేముంది?**
అదేంటి ఆశ్చర్యం లేదా? ఒక్కసారి బాబుగారు ఏమన్నారో గుర్తు చేసుకో.. రెండు రాష్ర్టాల్లో ఏ ఒక్క పార్టీనైనా బాబుగారు వదిలి పెట్టారా? పిల్ల కాంగ్రెస్, తల్లి కాంగ్రెస్ అని అన్ని పార్టీలను తిట్టారు కదా?
**అవును అయితే?**
నీకు గుర్తుందా? వైఎస్‌ఆర్ కాంగ్రెస్.. పిల్ల కాంగ్రెస్ కాంగ్రెస్




పార్టీలో కలిసి పోతారు అని ఆ పార్టీ పుట్టినప్పటి నుంచి బాబుగారు విమర్శిస్తున్నారు కదా?
**కావొచ్చు..**
తెలంగాణ ఉద్యమకాలం నుంచి బాబుగారు టీఆర్‌ఎస్ గురించి ఏమన్నారు? కాంగ్రెస్‌లో కలిసిపోతుంది అన్నారు కదా.
**అని ఉండొచ్చు. అయితే?**
అంత కన్నా ముందుకు వెళ్తే.. ఎన్టీఆర్ కాంగ్రెస్‌తో చేతులు కలిపారు.. లక్ష్మీపార్వతి మధ్యవర్తిత్వం వహిస్తున్నది.. అని వెన్నుపోటు కాలంలో చెప్పారా? లేదా?
**చెప్పి ఉండొచ్చు.. చెప్తే?**
అందరికీ కాంగ్రెస్‌తో సంబంధాలు అంటగట్టిన బాబే.. చివరకు రాహుల్‌గాంధీకి శాలువా కప్పి వీణ బహూకరించి మాది జన్మజన్మల బంధం అన్నట్టు నవ్వులతో ఫోజులు ఇచ్చారు.
**ఔను అయితే?**
మరి కాంగ్రెస్‌ను ముక్కలు, ముక్కలు చేయాలి. చంపేయాలి. ఇటలీ మాత కాంగ్రెస్‌ను పాతి పెట్టాలి అని ఆయన పదేపదే చెప్తుంటే.. తమ్ముళ్ల గొడ్డళ్లు నూరుతుంటే ఆయనేమో కాంగ్రెస్‌తో చెట్టపట్టాలేసుకోవడం ఆశ్చర్యం కాదా?
**ఆశ్చర్యం ఎందుకోయ్.. నేను ఇలాంటివి చిన్నప్పుడే చూశా. మా ఊర్లో నా చిన్నప్పుడు మధురవాణి అని ఒకరు ఉండేవారు. ఆమె అసలు పేరేమిటో తెలియదు.. కానీ అంతా మధురవాణి అనే వారు. చాలా పవిత్రంగా కనిపించేది ఊరిలో ఆడవాళ్లందరినీ ఆమె అనుమానించేది. వాళ్లు మంచి వాళ్లు కాదు అనేది.. ఆమెను చూసి వాళ్ల మావ మురిసిపోయే వాడు. మధురవాణి ఎంత పవిత్రమైంది అని.. ఆమె తరుచుగా పట్నానికి వెళ్లేది. అందరు ఆడవారిని అపవిత్రులు అనే ఆమెను అంతా నిప్పు అనే వారు. పాతివ్రత్యానికి చీర కడితే మధురవాణి లా ఉంటుంది అనే వారు. పట్నానికి వెళ్లే ఆమెను చూసి ఎవరూ అనుమానించే వారు కాదు. ఆమె రోజూ పట్నం వెళ్లి ఏం చేస్తుందో ఓ రోజు ఊరందరికీ తెలిసి పోయింది. అసలు విషయం తెలిసి అంతా ఆశ్చర్య పోయారు. అమ్మ మధురవాణి ఎంతటి జాణవే అని గ్రామస్థులు ముక్కున వేలేసుకున్నారు.**
నిజమా? ఆమె జీవితం ఆమె ఇష్టం.. కానీ ఇతర మహిళలను ఆమె ఎందుకలా అంతా అలాంటి వారే అనేది?
**అదే తెలివి.. మనమే ముందు ఇతరుల శీలాన్ని శంకిస్తే మనల్ని ఎవరూ అనుమానించరు. సాగినంత కాలం సాగుతుంది.. అని మధురవాణికి బాగా తెలుసు. యూట్యూబ్‌లో ఉంటుంది కావాలంటే కన్యాశుల్కం సినిమా చూడు. ఆ సినిమాలో మధురవాణి వేశ్య.. కానీ సినిమాలో మనకు ఎప్పుడూ ఆ అభిప్రాయం కలుగదు. ఆ పేరుకున్న మహత్తు అది.**
**అయితే ఇంతకూ తల్లి కాంగ్రెస్ ఏదీ పిల్ల కాంగ్రెస్ ఏదంటావ్?**
133 ఏండ్ల కాంగ్రెస్‌కేమో పిల్ల నాయకుడు.. 36 ఏండ్ల తెలుగు పార్టీకేమో వృద్ధ నాయకుడు. పిల్ల నాయకత్వంలోని తల్లి కాంగ్రెస్.. వృద్ధ బాబేమో పిల్ల కాంగ్రెస్. చిత్రంగా ఉంది కదూ. ఏమోరా నువ్వు మధురవాణి కథ చెప్పాక ఏదీ విచిత్రంగా అనిపించడం లేదు.

**- కౌటిల్య**

# కాంగ్రెస్ కోటలో గులాబీ జెండా!

**తాళ్లపెల్లి వెంకట్, జనగామ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న జనగామ నియోజకవర్గంలో గత సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ జెండా ఎగురవేసి సత్తా చాటింది. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ సారి కూడా టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డినే అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

**చరిత్ర తిరగరాసిన టీఆర్‌ఎస్**

1952లో జనగామ నియోజకవర్గం ఏర్పాటైంది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో జనగామ స్వల్ప మార్పులకు లోనైంది. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గానికి 15 సార్లు ఎన్నికలు జరుగగా, ఎనిమిదిసార్లు కాంగ్రెస్, మూడుసార్లు పీడీఎఫ్, రెండుసార్లు కమ్యూనిస్టులు, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. గత ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నాటి పీసీసీ చీఫ్‌గా ఉన్న పొన్నాల లక్ష్మయ్యను 32,695 ఓట్ల తేడాతో ఓడించి చరిత్రను తిరగ రాశారు.

**దూసుకుపోతున్న ముత్తిరెడ్డి**

ఈ ఎన్నికల్లో ముత్తిరెడ్డి మరోసారి గులాబీ జెండా ఎగురవేసే దిశగా దూసుకుపోతున్నారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఇక్కడి ఓటర్లు టీఆర్‌ఎస్ అభ్యర్థికి బ్రహ్మరథం పట్టారు. అంతకు ముందు నాలుగుసార్లు గెలుపొందిన పొన్నాల లక్ష్మయ్య.. మంత్రిగా కూడా పనిచేసినా ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరించారనే విమర్శలున్నాయి. గడిచిన నాలుగున్నరేండ్లలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం జనగామ జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టించింది. కరువు గడ్డగా పేరొందిన జనగామకు గోదావరి జలాలు తీసుకొచ్చి సస్యశ్యామలం చేసింది. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిని వివరిస్తూ త్వరలో జరగబోయే ఎన్నికల్లో మరోసారి జనగామ గడ్డపై గులాబీ జెండా ఎగురువేసే దిశగా




2011 లెక్కల ప్రకారం జనాభా **2,88,625**

- గ్రామీణ జనాభా: **81.85**%
- పట్టణ జనాభా: **18.15**%
- ఎస్సీలు: **19.43**%
- ఎస్టీలు: **6.31**%

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ **2018** ప్రకారం..

- ఓటర్లు: **2,06,790**
- పురుషులు: **1,03,418**
- స్త్రీలు: **1,03,360**
- ఇతరులు: **12**

**2014** ఎన్నికల ఫలితాలు
పోలింగ్: **80.55**%

- **84,074**(48.08%) టీఆర్‌ఎస్
- **51,379**(29.82%) కాంగ్రెస్
- **21,113**(12.25%) బీజేపీ

**విజేత: ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి (టీఆర్‌ఎస్) మెజారిటీ 32,695**
**రెండోస్థానం: పొన్నాల లక్ష్మయ్య (కాంగ్రెస్)**

**ఇంటర్వ్యూ..**

# ఖమ్మంలో టీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

'ఖమ్మం ఖిల్లాపై గులాబీ జెండా ఎగురడం ఖాయం. ప్రతి అర్హుడి గడపనూ సంక్షేమ పథకాలు ముద్దాడాయి. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పథకాలు గెలుపునకు బాటలు వేస్తాయి. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వివిధ అభివృద్ధి పనులకు సీఎం కేసీఆర్ సుమారు రూ.2 వేల కోట్లు మంజూరు చేశారు. 2500 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరయ్యాయి' అంటున్న ఖమ్మం టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌తో 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూ.

– ఖమ్మం, నమస్తే తెలంగాణ



**ఖమ్మంలో మీరు చేసిన అభివృద్ధి గురించి చెప్పండి?**
తెలంగాణ ఆవిర్భావం అనంతరం అధికార బాధ్యతలు చేపట్టిన సీఎం కేసీఆర్ ఖమ్మం అభివృద్ధికి ఎంతగానో సహకరించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా దాదాపు రూ.2 వేల కోట్లు మంజూరు చేశారు. మురికి కూపంగా మారిన లకారం చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. ఆర్టీసీ నూతన బస్టాండ్, ధంసలాపురం ఆర్వోబీ, త్రీటౌన్ ప్రాంతంలోని గోళ్లపాడు చానెల్ ఆధునీకరణ, ఐటీహబ్, వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. రూ.230 కోట్లతో మిషన్ భగీరథ పనులు పూర్తికావస్తున్నాయి. 2,500 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేశారు. ఇప్పటికే కొందరు గృహప్రవేశాలు కూడా చేశారు.

**మహాకూటమిపై మీ కామెంట్?**
కేవలం అధికార దాహంతో ఏర్పాటైన కూటమి ముమ్మాటికీ మాయాకూటమే. ఆయా పార్టీలకు తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమంతో అస్సలు పనిలేదు. అబద్ధాలతో అధికారంలోకి రావాలని చూస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వంచన పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్తారు.

**ఏయే వర్గాల నుంచి మీకు మద్దతు లభిస్తున్నది?**
తెలంగాణలోని అన్నివర్గాల ప్రజలు సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ పట్ల పూర్తి విశ్వాసంతో ఉన్నారు. ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌లో సైతం అదే ఒరవడి కనిపిస్తున్నది. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని ప్రతి గడపకూ దక్కాయి. ప్రచారంలో ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారు. ఎమ్మెల్యేగా మరోసారి గెలిపిస్తే నిర్మాణ దశలో ఉన్న అన్ని పనులూ పూర్తి చేయిస్తా. ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాను. విలీనమైన పంచాయతీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తా. ఔటర్ రింగ్‌రోడ్డును పూర్తి చేస్తాను.